గాలివాన బీభత్సం


పేట నుంచి బలుసుపాడు వెళ్లే రోడ్‌లో నేలకొరిగిన వృక్షం


నందిగామ జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వర్షపునీరు

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు,చెట్లు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మండలంలో సోమవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. పలు చోట్ల వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో సోమవారం రాత్రి నుంచి జగ్గయ్యపేట పట్టణంతో పాటు, మండలంలోని బలుసుపాడు, త్రిపురవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. జగ్గయ్యపేట-బలుసుపాడు రోడ్‌లో చెట్లు పడిపోవడం, విద్యుత్‌స్తంభాల తీగలు తెగి రోడ్డుపై పడిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయి, ట్రాఫిక్ స్తంభించింది. బలుసుపాటు సబ్ స్టేషన్ ఏరియా పరిధిలో జగ్గయ్యపేట నుంచి బలుసుపాడు రోడ్‌లో త్రిపురవరం కూడలిలో ఉన్న బలుసుపాడు విద్యుత్ సబ్ స్టేషన్‌కు మధ్యలో మెయిన్ లైన్‌లో గిన్నె చెరువు వద్ద మూడు విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. అలాగే బలుసుపాడు సబ్ స్టేషన్‌కు జగ్గయ్యపేట నుంచి వెళ్లే స్పేర్ లైన్‌లో నాలుగు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. విద్యుత్ శాఖ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన బలుసుపాడు మెయిన్ లైన్ స్తంభాలను పునరుద్ధరించారు. జగ్గయ్యపేట పట్టణానికి సోమవారం అర్ధరాత్రి విద్యుత్ సరఫరా చేయగా, పరిసర గ్రామాలైన బలుసుపాడు, త్రిపురవరంలో మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. డీఈఈ జె.శ్రీనివాసరావు, పట్టణ ఏఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 23 చోట్ల స్తంభాలు విరిగిపోయినట్లు తెలిపారు. వాటిని కూడా పునరుద్ధరించామన్నారు. తద్వారా సుమారు రూ. 5 లక్షల నష్టం వాటిల్లిందన్నారు.

నందిగామలో..

నందిగామ: నందిగామ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పగటి సమయంలో వేసవిలో మాదిరిగా భానుడు తన ప్రతాపాన్ని చూపాడు. సాయంత్రం ఐదు గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు 50 నిమిషాల పాటు భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో పలు రహదారులు చెరువులను తలపించాయి. ముఖ్యంగా పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో వర్షం కురుస్తున్న సమయంలో 65వ నంబర్ జాతీయ రహదారిపై దాదాపు అడుగుమేర వరద నీరు ప్రవహించాయి. వర్షం కాస్త తగ్గిన తర్వాత కూడా జాతీయ రహదారిపై వర్షపు నీరు ప్రవహిస్తూనే ఉంది. ఇదిలా ఉండగా భానుడి ప్రతాపానికి విలవిలలాడిన ప్రజలు ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ఊపిరి పీల్చుకున్నారు. ముఖ్యంగా రైతులు సైతం భారీ వర్షానికి మురిసి పోయారు. మరో రెండు వర్షాలు కురిస్తే ఖరీఫ్ సాగు ప్రారంభించవచ్చని రైతులు చెబుతున్నారు.


బలుసుపాడు రోడ్‌లో తీగలు తెగిన విద్యుత్ స్తంభాలు


విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ పనులు చేపట్టిన విద్యుత్ సిబ్బంది


కూలిన విద్యుత్ స్తంభం

రైతుల ఖాతాల్లో రూ.413.94 కోట్ల జమ

జగ్గయ్యపేట: పీఎం కిసాన్ పథకం ద్వారా నియోజకవర్గానికి సంబంధించి రూ.413.94 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని వ్యవసాయ శాఖ ఏడీఏ భవానీ మంగళవారం పేర్కొన్నారు. జగ్గయ్యపేట మండలంలో 6,957 మంది రైతులకు రూ.139.1 కోట్లు, వత్సవాయి మండలంలో 7,097 మంది రైతులకు రూ.141.94 కోట్లు, పెనుగంచిప్రోలు మండలంలో 6,645 మంది రైతులకు రూ.132.9 కోట్లు పీఎం కిసాన్ పథకం ద్వారా రైతుల ఖాతాల్లో జమవుతాయని తెలిపారు. అన్ని గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వ్యవసాయ వాఖ సిబ్బంది ప్రధాని మోదీ ప్రత్యక్ష కార్యక్రమాన్ని వీక్షించినట్లు పేర్కొన్నారు.

విత్తనాలు సకాలంలో అందిస్తాం

వీరులపాడు: ఖరీఫ్ పంట సీజన్‌కు సంబంధించి రైతులకు అన్ని రకాల విత్తనాలను సకాలంలో అందించనున్నట్లు వ్యవసాయాధికారి జోగేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 154.8 క్వింటాళ్ల ఎంటీయూ-1061 రకం విత్తనాలు, 80 క్వింటాళ్ల బీపీటీ-5204 రకం విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. వరి విత్తనాల నాణ్యత పరిశీలించేందుకు మొలక శాతాన్ని పరీక్షిస్తున్నట్లు తెలిపారు. మొలక శాతాన్ని బట్టి రెండు, మూడు రోజుల్లో రైతులకు పంపిణీ చేస్తామని చెప్పారు. ఎంటీయూ-1061 రకం విత్తనాలు 30 కిలోల బస్తా రాయితీపై రూ. 1,044కు, బీపీటీ-5204 రకం 25 కిలోల బస్తా రాయితీపై రూ. 920కు అందించనున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లోని వీపీఏలను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

ఘనంగా మహా గణపతి రథోత్సవం



జయంతిపురం(జగ్గయ్యపేట): గ్రామంలోని రామ్‌కో సిమెంట్స్ కర్మాగారంలో విజయ గణపతి ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి విజయ గణపతి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక రథంపై గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఊరేగించారు. అనంతరం కలశం ఊరేగింపు, మహా కుంభాభిషేకం తదితర కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎండీ వెంకటరామరాజు, కర్మాగారం ప్రతినిధులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



నందిగామ: సత్య దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రంతోపాటు మజ్జిగ పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. పట్టణంలోని మెయిన్ బజార్ ప్రాంతంలో సత్య దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఏప్రిల్ మొదటి వారంలో చలివేంద్రం ఏర్పాటు చేసి ఎండలు పూర్తిగా తగ్గినంత వరకు నిత్యం తాగునీటితోపాటు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం కూడా ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభమైన చలివేంద్రం నిర్విరామంగా కొనసాగుతోంది. మంగళవారం చలివేంద్ర ద్వారా వెయ్యి మందికి మజ్జిగ పంపిణీ చేసినట్లు నిర్వాహకుడు రామిరెడ్డి కోటి సూర్యం తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



నందిగామ: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో ఐదు సంవత్సరాలు నిండిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో జాయిన్ చేశారు. ఐసీడీఎస్ సీడీపీఓ భాగ్య రేణుక ఆధ్వర్యంలో పట్టణ శివారు అనాసాగరం, హనుమంతుపాలెం గ్రామాల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కరుణకుమారి, వెంకట్రావమ్మ, తారాబీ పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణోత్సవం



పెనమలూరు: పోరంకి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామివారి దేవస్థానం 20వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆలయంలో శ్రీవెంకటేశ్వర స్వామివారి తిరుక్కల్యాణం ఘనంగా జరిగింది. ఉదయం స్వామివారికి సువర్ణ పుష్పార్చన, సామూహిక విష్ణు సహస్ర నామార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహిళా భక్తులు గరుడోత్సవం చేశారు. కాగా త్రిదిండి అష్టాక్షరి సంపత్కుమార రామానుజ జీయర్ స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో స్వామివారి కల్యాణం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణ మహోత్సవం తిలకించారు. కాగా బుధవారం ఉదయం 10 గంటలకు శ్రీవారికి లక్ష మల్లెల అర్చన, 11 గంటలకు భక్తులకు అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది.

పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగునకు కార్యదర్శులు అన్ని చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రమేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పారిశుద్ధ్య నిర్వహణ, తాగు నీటి సరఫరాపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాలలో పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రెయిన్ల పూడిక తీతతో పాటు మురుగు నీటి నిల్వ ప్రాంతాలను, తాగునీటి ట్యాంకులనుశుభ్రం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సాంబశివరావు, విస్తరణాధికారి శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలి


విద్యార్థులకు కిట్స్ అందజేసిన ఎంపీపీ గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు నాగమణి

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంతో కూడిన కిట్స్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం ప్రభుత్వాలు ఎన్నో పథకాలు ప్రవేశ పెడుతున్నాయన్నారు. విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఉపాధ్యాయులు కూడా అంకిత భావంతో విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పి.విజయలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు పిడికిటి కోటేశ్వరరావు, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ జాన్‌మియా, ఆలయ మాజీ చైర్మన్ అత్తలూరి అచ్యుతరావు పాల్గొన్నారు.

జీతాలు వెంటనే చెల్లించాలి


అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ముందు ధర్నా చేస్తున్న స్టీల్ ప్లాంట్ లైమ్‌స్టోన్ మైన్స్ ఉద్యోగులు, కార్మికులు


మైన్స్ డీజీఎం నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణ శివారులో ఉన్న విశాఖపట్నం వారి స్టీల్ ప్లాంట్‌లోని జగ్గయ్యపేట లైమ్‌స్టోన్ మైన్స్ విభాగంలో ఉద్యోగులు తమకు జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ స్థానిక అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ముందు మంగళవారం ధర్నా చేశారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ గత మూడు నెలలుగా ఒకటో తేదీన చెల్లించాల్సిన జీతాలు 20వ తేదీ వచ్చినా కూడ చెల్లించడం లేదని వాపోయారు. రూ.23,467 వేల కోట్ల టర్నోవర్ గల విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను సమయానికి జీతాలు చెల్లించలేని దుస్థితికి తీసుకొచ్చారన్నారు. ప్రస్తుతం ఉన్న మేనేజ్‌మెంట్ దీనికి ప్రధాన కారణమని తెలిపారు. మేనేజ్‌మెంట్ వారు ఈ రోజుకు కూడా జీఎస్టీ పన్నులు చెల్లించాలని, రా మెటీరియల్ కొనడానికి డబ్బులు లేవనే కుంటి సాకులతో కార్మికుల పొట్టకొడుతున్నారని ఆరోపించారు. సమయానికి జీతాలు పడక బ్యాంకులకు ప్రతి నెలా చెల్లించాల్సిన ఈఎంఐల ఆలస్యం వలన కార్మికులు వేల రూపాయలు ఫెనాల్టీలు కట్టాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా పరిస్థితిని చక్కబెట్టి సకాలంలో జీతాలు చెల్లించాలని కోరారు. లేకుంటే భవిష్యత్‌లో జరగబోయే పరిణామాలకు మేనేజ్‌మెంట్ పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని తెలిపారు. అనంతరం మైన్స్ డీజీఎం నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, బీఎంఎస్, డీఐటీయూ నాయకులు జేవీఎస్‌డీ ప్రసాద్, వలిబాబు, విజయ్ కుమార్, జోమి థామస్, రామచందర్ నాయక్, మన్నె శ్రీనివాసరావు, ఉద్యోగులు ఎస్‌కేబీఎస్. వర్మ, రామకృష్ణ, మల్లం రాంప్రసాద్, హేమనాయక్, నవీన్, దేవోజీ, కాంట్రాక్టు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



వీరులపాడు: ఇసుక, మట్టి, గ్రావెల్ అక్రమంగా తరలిస్తే సహించేది లేదని ఎస్ఐ మహాలక్ష్మణుడు పేర్కొన్నారు. మండలంలోని వెల్లంకి గ్రామంలోని వైరాఏటి నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అక్రమ వ్యాపారాల నియంత్రణకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనుమతులు లేకుండా ఇసుక, మట్టి, గ్రావెల్ తరలిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ధర్మా చెరువు చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణానికి ఆమోదం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ధర్మాచెరువు చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణానికి గ్రామ పంచాయతీ తీర్మానం చేసింది. మంగళవారం గ్రామ సర్పంచి కాటూరి సరళ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కార్యదర్శి జీటీవీ రమణ తాగునీటి ధర్మా చెరువు చుట్టూ ఫెన్సింగ్ నిర్మించడానికి ప్రతిపాదించగా సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసే పెట్రోల్ బంక్‌కు కూడా ఆమోదం లభించింది. పోలవరం కాల్వపై జంగిల్ క్లియరెన్స్ కోసం, అభివృద్ధి పనుల బిల్లులు చెల్లింపునకు సమావేశంలో ఆమోదం తెలిపారు. సమావేశంలో పలువురు పాలకవర్గ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు పోలారెడ్డి ప్రసాద్‌రెడ్డి, బొంతు సరోజిని పాల్గొన్నారు.

అలరించిన భక్తిరంజని

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ధర్మపథం కళావేదికపై నెల్లూరుకు చెందిన గానం అకాడమీకి కళాబృందం ఆలపించిన భక్తిరంజని భక్తులను విశేషంగా అలరించింది. మల్లాది అనూష నేతృత్వంలో పలు భక్తి గీతాలను ఆలపించగా, వయోలిన్‌పై రాయప్రోలు సుబ్రహ్మణ్యం, మృదంగంపై రామాలయం ఈశ్వర్‌పాయ్, కీబోర్డుపై సురభీ సంగీత్ సౌరభ్‌లు చక్కటి సహకారం అందించారు. అనంతరం మల్లాది అనూష బృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

ఉపాధ్యాయులను ఎప్పటికీ మర్చిపోకూడదు


తెలుగు ఉపాధ్యాయుడు ఇస్మాయేల్‌ను సత్కరిస్తున్న గ్రంథపాలకుడు రామచంద్రుడు

కంచికచర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన సదస్సులో విద్యార్థులకు మంచి లక్షణాలు అలవర్చుకునేలా అవగాహన కల్పించిన ఉపాధ్యాయుడి సేవలు మర్చిపోలేనివని గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో మంగళవారం తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయేలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 రోజుల పాటు జరిగిన వేసవి విజ్ఞాన సదస్సులో రోజూ తెలుగు ఉపాధ్యాయుడు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించటంతో పాటు సమాజంలో ఏ విధంగా నడుచుకోవాలి, తల్లిదండ్రులపై ఎలా గౌరవంగా ఉండాలని నేర్పించారన్నారు. అంతేకాకుండా ఆటపాటలతో కూడిన విద్యనందిచండంతోపాటు జాతీయ నాయకులు, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలొదిన నాయకులు చరిత్రలు చదించాడన్నారు. అయితే విజ్ఞాన సదస్సు ఆఖరి రోజున ఇస్మాయేల్ ఉపాధ్యాయుడు అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడలోని ఓ ఆస్పత్రిలో చేరాడు. ఇటీవల ఆరోగ్యం కుదుటపడిన తర్వాత గ్రంథాలయానికి రావటంతో అభినందించామన్నారు. అనంతరం చిరు ధాన్యాలతో ఆరోగ్యం అనే పుస్తకాన్ని బహూకరించారు. కార్యక్రమంలో మాజీ గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వర్లు, కవి రచయిత నీలం సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

● వావ్.. అద్భుతం


నందిగామ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం ఏర్పడ్డ ఇంద్రధనస్సు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. వర్షం తగ్గిన వెంటనే సాయంత్రం 6:30 గంటల సమయంలో ఆకాశంలో కనిపించిన ఇంద్రధనస్సు ఎంతో ఆకర్షణీయంగా కనిపించింది. చల్లటి వాతావరణంలో ప్రశాంతంగా ఉన్న మేఘాల మధ్య కనిపించిన ఇంద్రధనస్సును చూసి ప్రకృతి ప్రేమికులు మురిసిపోయారు. – నందిగామ

మైనింగ్ చెక్‌పోస్టుల ఏర్పాటు


పాతపాడులో మైనింగ్ చెక్‌పోస్ట్

విజయవాడరూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో మైనింగ్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ పి.జాహ్నవి తెలిపారు. పాతపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన మైనింగ్ చెక్‌పోస్టును మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా రబ్బీష్, మట్టి అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాలను కట్టడిచేసి పెనాల్టీలు విధిస్తున్నట్లు తెలిపారు. జక్కంపూడి గ్రామ పరిధి పాములకాల్వ వద్ద మైనింగ్ చెక్‌పోస్టును ఏర్పాటు చేసి రెండు రోజుల్లో నాలుగు లారీలను పట్టుకొని రూ.50 వేల చొప్పున పెనాల్టీ విధించామని చెప్పారు. అక్రమంగా మైనింగ్ రవాణా చేస్తున్న లారీలను సీజ్ చేశామన్నారు. అక్రమ మైనింగ్‌ను అరికట్టేందుకు రోజుకు మూడు షిఫ్టుల చొప్పున మైనింగ్ చెక్‌పోస్టుల్లో సిబ్బంది విధులు నిర్వహిస్తారని తెలిపారు.

యువకుడి వైద్యానికి ఆర్థిక సాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): క్యాన్సర్‌తో బాధపడుతున్న 16 ఏళ్ల యువకుడు గంధం కుటుంబరావు వైద్య ఖర్చుల నిమిత్తం దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయాన్ని అందజేసింది. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలానికి చెందిన గంధం శ్రీను, పార్వతి దంపతులు రోజు వారీ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో వారి కుమారుడు కుటుంబరావు ఏడాది కిందట క్యాన్సర్ బారినపడటంతో శ్రీను కుటుంబం తల్లడిల్లిపోయింది. క్యాన్సర్ చికిత్సలో భాగంగా కిమోథెరపీ ట్రీట్‌మెంట్ కోసం శ్రీను దాదాపు ఏడాది కాలంగా చాలా ఖర్చు చేస్తూ వచ్చారు. ఇంకా ఖర్చు చేసేందుకు ఆర్థిక పరిస్థితి సహకరించక పోవడంతో సాయం కోసం దీవెన ఫౌండేషన్ సంస్థను ఆశ్రయించారు. స్పందించిన దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ తరపున గ్రూప్ సభ్యులు హెడ్ కానిస్టేబుల్ రాధాకృష్ణ, మాచవరం హెడ్ కానిస్టేబుల్ శ్రీను మంగళవారం హాస్పిటల్‌కు వెళ్లి బాధితుడి తల్లి పార్వతికి రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్న తమలాంటి పేద కుటుంబాలకు సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. దీవెన ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యుడు నాగరాజు మాట్లాడుతూ విజయవాడ సిటీ పోలీసులంతా కలిసి స్థాపించుకున్న దీవెన ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు సాయం అందజేస్తున్నామని చెప్పారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని ప్రత్యేక హోదా సాధన సమితి చైర్మన్ తోట సంగమేశ్వర రావు(సంగమ్) కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దశాబ్దకాలంగా ప్రత్యేక హోదా విషయంలో రాష్ట్ర ప్రజానీకంతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుకుంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలను, ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక హోదాను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిమాణానికి తగ్గట్టు రాజధాని నిర్మించాలన్నారు. భారీ స్థాయిలో కిలోమీటర్ల పరిధిలో రాజధాని నిర్మాణం చేపట్టడం వలన రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతుందన్నారు. ప్రజల సొమ్ము దుర్వినియోగం అవుతుందని చెప్పారు. పెట్టుబడి రాజధాని చుట్టూ కేంద్రీకృతమై ఆర్థిక అసమానతలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాలన్నింటిని పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర అవసరాలకు తగ్గట్టుగా రాజధాని నిర్మించాలని సూచించారు. ప్రత్యేక హోదా ఇవ్వడంతో పాటు రాజధాని పరిధి కుదింపు కోసం ఉద్యమం చేపడతామని ప్రకటించారు. ప్రత్యేక హోదా కోసం జూలై 1 నుంచి 7వ తేదీ వరకు ఢిల్లీలో ప్రత్యేక కార్యక్రమం చేపడతామన్నారు. సమావేశంలో ఆంధ్ర రాష్ట్ర ప్రజా సమితి అధ్యక్షుడు జి.ఎస్. ఫణి రాజ్, దేవరపల్లి మహేష్, భారత్ సమాజ్ పార్టీ అధ్యక్షుడు మంచాల జోసెఫ్ పాల్గొన్నారు.